# ఎదురుచూసిన రాత్రి

**మల్లాది వెంకటకృష్ణమూర్తి**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సునీల్, గుంటూరు నుంచి వచ్చే క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌కోసం ఎదురుచూస్తున్నాడు రాత్రి ఏడుంపావుకి. కొన్నినిముషాలలో బండి ప్లాటుఫారంమీదికి వస్తుందిని ఎనౌన్సర్ చెప్పాడు.

సునీల్ అనేకసార్లు అనేక స్టేషన్‌లకి వెళ్ళి చాలా మందిని రిసీవ్ చేసుకున్నాడు. కాని ఈ సారిమాత్రం ఎన్నడూలేని, ఇకముందెన్నడూరాని ప్రత్యేకత వుంది. అందుకే సంతోషంగా వున్నాడు.

సునీల్‌భార్య వస్తోంది గుంటూరునుంచి.

సునీల్‌కి వివాహం అయి ఎనిమిదినెలలయింది. అఖరిసారి తన భార్యనిచూసి మూడునెలలు దాటింది. కాపరానికి తొలిసారిగా వస్తోంది. ఇక జీవితాంతం తనతో గడపడానికి, తన జీవితంలో, జీతంలోపాలు పంచుకోడానికి వస్తోంది.

అదికూడాకాదు ఆరోజు ప్రత్యేకత.

సునీల్ వివాహం అయాక కార్యంచేసుకోలేదు. అలాంటి ఆర్భాటాలేమీ తనకి అంతగా నచ్చవని, వద్దనీ వారించాడు తండ్రి విజయవాడనుంచి రెండుసార్లు వ్రాసినా. మంచిరోజు చూసి కాపరానికి పంపించమని వ్రాసాడు. సునీల్ బావమరిది హైదరాబాదులోనే పని చేస్తున్నాడు. అతను గుంటూరు వెళ్ళాడు చెల్లెల్ని కాపరానికి తీసుకురావడానికి.

క్రితంరోజు పదిరోజుల సెలవు మంజూరుచేస్తూ అన్నాడు సునీల్ ఆఫీన్‌మేనేజర్. "ఆఫీసుగురించి, పనిగురించి ఈ పదిరోజులు మర్చిపోండి. మళ్ళా సంవత్సరం ఈపాటికి కొడుకు బారసాలకి సెలవు అప్లికేషన్ ఇవ్వాలి తెలుసా?"

ఆఫీసర్ మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు సునీల్

గుంటూరు రెండుమూడుసార్లు వెళ్ళాడతను పెళ్ళయాక ఉగాదికి, శ్రీరామనవమికి. తనని ఏకాకిగా వదుకోబెట్టారు. కాఫీ తీసుకవచ్చినప్పుడు మాత్రం అయిదారుసార్లు ముద్దుపెట్టుకున్నాడంతే.

ఈ రాత్రే తనకు ప్రధమరాత్రి. ఒకరిచేతుల్లో మరొకరు కరిగేరాత్రి ఈరాత్రే. ఇంతకాలం, యవ్వనం ప్రవేశించిన క్షణంనుంచి ఇంత దాకా ఆత్రంగా, ఆనందంగా ఎదురుచూస్తున్న రాత్రిఇదే.

మరోసారి నవ్వుకున్నాడు సునీల్. అన్ని ఏర్పాట్లు తనే చేసుకున్నాడీరాత్రి. ఆగదిచూస్తే ఏమంటుంది? సిగ్గుపడుతుందా? నవ్వుకుంటుందా? సంతోషపడుతుందా?

తన బావమరిది తమతో ఇంటికిరాకుండా వెళ్ళిపోతే బావుండును. తెలివయినవాడయితే రాడు. డీజల్ ఇంజన్‌ని దూరంనుంచే చూసాడు సునీల్. గుండెల్లో రైళ్ళు పెరిగెత్తినట్లుగా వుంది సంతోష ఒరవడికి.

తను మిస్ కాకూడదు వాళ్ళని. కళ్ళముందు పరిగెడుతున్న రైల్వే కంపార్ట్‌మెంట్‌ల వంక, వాటితో కిటికీలముందు కూర్చుని చూస్తున్న వాళ్ళవంక పరికించి చూసాడు సునీల్. ఏడోనంబర్ కంపార్ట్‌మెంట్ తలుపుదగ్గర నిలబడి చెయ్యివూపాడు సునీల్ బావమరిది. సునీల్ కళ్ళు తన భార్యకోసం వెదుకుతుండగానే ఆ కంపార్ట్‌మెంట్ కళ్ళముందునుంచి దాటిపోయింది.

సునీల్ ఆగివున్న కంపార్ట్‌మెంట్ దగ్గరికి వెళ్ళే

సరికి సామాను వెనక నడుస్తున్నారు అన్నా, చెల్లెళ్ళిద్దరూ. సిగ్గుగా, ఓరగా, నవ్వుతూ చూడచ్చా చూడకూడదా అన్నట్లుగా, చూడాలా, వద్దా అన్నట్లుగా చూసింది సునీల్ భార్య సునీల్ వంక.

ప్లాటుఫారందాటి బయటికి వచ్చాక సునీల్ బావమరిది ఆటోలో సామాను పెట్టించి, తనే మాట్లాడాడు. ఆటోని సునీల్ ఇంటికి.

సునీల్ చేతిలో అయిదురూపాయల కాగితం వుంచి అన్నాడు.

"రేపు మధ్యాహ్నం వస్తాను వీలంటే, జాగ్రత్తగా వెళ్ళండి. రేపొస్తానమ్మాయ్."

సునీల్ మనసులోనే కృతజ్ఞత తెల్పుగొన్నాడు తన బావమరిదికి. ఆటో కదిలాక అన్నాడు.

"మీఅన్న ఫర్వాలేదే. మనవెంట వస్తాడను కొన్నాను."

అందంగా నవ్వింది సునీల్ భార్య. లేదా సునీల్‌కి అలా అనిపించింది.

"పదిరోజులు సెలవు పెట్టాను"

"........."

"రారేమోనని భయపడ్డాను. ఎప్పుడు ఎవర్ని రిసీవ్‌చేసుకోడానికి స్టేషన్‌కి వచ్చినా, వాళ్ళురారేమోనని భయం వుంటూంటుంది నాకు. ఇవాళ ఇంకా ఎక్కువ భయపడ్డాను."

"........."

"చాలా సామాను తెచ్చావే? సారేగట్రా చేరిచాలా మూటలు అయాయి?"

"మనింటికి ఇంకా ఎంతదూరం?" అడిగింది.

ఆటో డ్రయివర్‌కి అయిదు రూపాయలు ఇచ్చి, సామానంతా ఇంట్లోకి చేర్చాడు సునీల్. మూడు గదులు, వంటగది కాకుండా. 'ఆగది' తలుపులు ముందరేవేసి బయట గొళ్ళెం పెట్టాడు. ముందరే ఆ గది చూపించడం ఇష్టంలేదు సునీల్‌కి.

"వంట చేశాను. ప్రయాణంచేసి అలసిపోయి వస్తావని చేసివుంచాను. ఇవాళచేశానని రోజూ చేయమంటే మాత్రం వూరుకునేది లేదమ్మాయ్."

సునీల్ భార్య చిన్నగా నవ్వింది. స్నానం చేయడానికి స్నానాల గదిలోకి వెళ్ళింది.

అప్పుడు గుర్తుకు వచ్చింది సునీల్‌కి, అగ్గిపెట్టె కొనాలనుకున్న సంగతి మర్చిపోయాడని. సునీల్ భార్యని అడిగాడు డ్రస్ చేసుకోగానే.

"అలా సరదాగా మెయిన్‌రోడ్‌దాకా వెళ్ళొద్దామా? అయిదు నిముషాల్లో తిరిగి వచ్చేద్దాం. రాగానే అన్నం తినచ్చు."

"మీ యిష్టం."

అంతదాకా సునీల్ తన భార్యని దగ్గరకు తీసుకోలేదు, విసుగ్గా వుంటుందని. నడుంచుట్టూ చేతులువేసి, మీదకి లాక్కున్నాడు మృదువుగా.

"బొట్టుపాడవుతుంది" వారించింది సునీల్‌ని

ఇల్లు తాళం వేసి బయటికి వచ్చారిద్దరు. నడుస్తూంటే అన్నది సునీల్ భార్య.

"పాలు పొంగించకుండా వంటచేసారే?"

"నాకు తెలియదు. మర్చాను."

"ఫర్వాలేదులెండి. రేపు పాలతో గిన్నెలు కడిగి చేసుకుందాం."

కిళ్ళీషాప్ ముందు ఆగాడు సునీల్. అగ్గిపెట్టె కొన్నాడు. వెనక్కి తిరుగుతుంటే తమలపాకులు కొనలేదని గుర్తొచ్చింది. కిళ్ళీషాపతను కడుతున్న కిళ్ళీని చూసాక.

రెండు కిళ్ళీలు కట్టమని చెప్పాడు. తమలపాకులు లేకుండా మొదటి రాత్రి ఏం రాత్రి? ఇంకా నయం గుర్తొచ్చింది.

కిళ్ళీలు అందుకొంటూండగా చెవులు చిల్లులుపడేలా లారీ హారన్, కీచుమంటున్న లారీ చక్రాల చప్పుడు, ఎవరివో బాధాకరమయిన అరుపులు వినబడ్డాయి సునీల్‌కి.

గుండె ఝల్లుమంటూంటే వెనక్కి తిరిగి చూసాడు. కళ్ళు తిరిగినట్లయాయి. ఎదురుగా లారీ. కంగారుగా లారీని డ్రయివరు వెనక్కిపోనిస్తున్నాడు. రోడ్డుకి అడ్డంగా, లారీచక్రాల క్రింద పడి నలిగిన ఇద్దరు సైకిలిస్టులు. ఒకతని తల పగిలి, మెదడులోంచి కారుతోంది రక్తం నేలమీదకి ఎర్రగా, చిక్కగా. అతనికి అక్కడికక్కడే ప్రాణం పోయినట్లుంది.

ఇంకొకతను రోడ్డుమీద దొర్లుతూ అరుస్తున్నాడు బాధగా. "ఓ గాడ్! జీసస్!! గాడ్!!!"

అతని మోకాలు విరిగి రక్తం కారుతోంది.

"వద్దు. పద."

కళ్ళప్పగించి, అచేతనురాలయి నిలబడిపోయి చూస్తున్న తన భార్య చేతిని పట్టుకొని, రిక్షావైపు లాక్కెళ్ళాడు సునీల్ గాభరాగా. ఆ దృశ్యం మగాడయిన తనే భరించలేనిదిగా వుంది సునీల్‌కి.

రిక్షా యింటికి చేరేవాక, దాదాపు రెండు నిముషాల సేపు సునీల్ తన భార్యతో ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయాడు. ఆ రక్తం, ఆ జాలిగొలిపే దృశ్యం సునీల్ మనసుని చెదిరేలా చేసింది.

రిక్షావాడికి రూపాయినోటు అందించి తలుపు తాళం తీసాడు. మౌనంగా లోపలికి నడిచింది సునీల్ భార్య. మధ్యగదిలో కుర్చీలో కూలబడిపోయింది, శక్తిఅంతా కోల్పోయిన దానిలా.

సునీల్‌కి దాదాపు అయిదు నిముషాలు ఏం చేయాలో తోచలేదు. ఎదురుగా కనబడ్డ రేడియోని ఆన్ చేసి తెలుగు పాటలు పెట్టాడు. అరగంట దాకా ఇద్దరూ తెలుగుపాటలు వింటూండిపోయారు, ఒకరితో మరొకరు మాట్లాడకుండా.

పాటలు అయిపోయాయి తొమ్మిదింపావుకి. మరో అయిదు నిముషాలాగి "అన్నం తిందామా?" అడిగాడు సునీల్ భార్యని.

"నాకాకలిగా లేదు" అన్నది సునీల్ భార్య. ఆ మాటల్లో బాధ. "ఛ. ఎందుకలా అయిపోయావ్?" లాలనగా తల నిమురుతూ అన్నాడు. లేదాడు.

"ఆ గది" గొళ్ళెం తెరచి, లోపల నిలబడి చూశాడు. గది మధ్యలో మంచం. మంచం మీద తెల్లటి దుప్పటి. గులాబి రేకులు, మల్లెపూవులు ఆ దుప్పటి నిండా. స్టాండ్‌కి అగరత్తులు నిండుగా. స్టాండ్ ప్రక్కన పళ్ళెంలో డజను కొవ్వొత్తులు వెలిగించడానికి సిద్ధంగా వున్నాయి. కిటికీ కర్టెన్స్ మూసివున్నాయి. మంచం ప్రక్కన ఫ్లాస్కులో పాలు. పళ్ళెం నిండా స్వీట్స్.

అగరత్తులు, క్రొవ్వొత్తులు అగ్గిపెట్టెతో వెలిగించి, గది తలుపుమూసి, భార్యని ఆగదిలోకి తీసుకు వెళితే కొంతదాకా తేరుకుంటందనుకున్నాడు. గుమ్మం దగ్గరే ఆగిపోయాడు. మధ్య గదిలో తన బెడ్డింగ్ పరుచుకుని పడుకొనివుంది సునీల్ భార్య.

బాగా సెన్సిటివ్ అనుకున్నాడు ఈజీ చైర్‌లో పడుకుంటూ.

ఈజీ చైర్‌లో పడుకున్న సునీల్‌కి అర్థరాత్రి మెలకువ వచ్చింది గోడగడియారం పన్నెండు సార్లు మ్రోగుతూంటే. ఉలిక్కిపడి లేచాడు. పడుకున్న తన భార్య వైపుచూసాడు.

"వద్దు అతని మీదకు పోనివ్వద్దు కాళ్ళు లేకపోతే బ్రతకలేడు" నిద్రలో కలవరిస్తూ, నెమ్మదిగా వెక్కివెక్కి ఏడుస్తోంది సునీల్ భార్య.

లేచి వెళ్ళి, "పిచ్చి" అంటూ నుదుటిమీద ముంగురులను సవరించి, భార్య బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాడు సునీల్ మృదువుగా. మర్నాడు సినిమా క్యూలో, చిల్లర కోసం జేబులు వెతుకుతూంటే చేతికి మెత్తగా ఏవో తగిలాయి సునీల్‌కి. బయటకి తీసి చూసి, తన భార్య కళ్ళ బడకుండా ఆ రెంటినీ డస్ట్ బిన్‌లో పారేసాడు.

ఆ రెండూ క్రితం రాత్రి కొన్న కిళ్ళీలు.

ఆ సంఘటన, తన భార్యలో మానవత్వం, జాలి ఉన్నాయన్న సంగతిని రుజువుచేసింది సునీల్‌కి. కాని సునీల్ ఆశపడ్డరీతిగా, ఎదురుచూసిన రాత్రి వృధా అయిపోయింది. ✱